


ధరలేక టమా'రా..'
టమాటాకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో



పింఛన్‌కు వచ్చి అగ్నికి ఆహుతి
బతుకుదెరువుకు ఊరెళ్లి పింఛన్ కోసం మనుమరాలితో కలిసి ఊరికి వచ్చిన ఓ వృద్ధురాలు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇద్దరు సజీవదహనమయ్యారు. 8లో



బ్రహ్మోత్సవాలకు వేళాయే..
చల్మెడ గ్రామ శివారులోని తిరుమల స్వామి రథసప్తమి పురస్కరించుకొని 27వ తేదీ నుంచి 30 వరకు బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహించనున్నారు. 9లో

న్యూస్‌రీల్

మెదక్ నుంచి యాదగిరిగుట్టకు బస్సు

డీఎం రవిచందర్



బస్సును ప్రారంభిస్తున్న డీఎం రవిచందర్

మెదక్‌జోన్ : ప్రయాణికుల సౌకర్యార్థం మెదక్ నుంచి యాదగిరి గుట్టకు బస్సును ప్రతిరోజూ నడుపుతామని మెదక్ ఆర్టీసీ డీఎం రవిచందర్ పేర్కొన్నారు. బుధవారం మెదక్– యాదగిరి గుట్టకు బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బస్సు మెదక్ నుంచి వయా రామాయంపేట, దౌల్తాబాద్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, జగదేవ్‌పూర్, భువనగిరి మీదుగా యాదగిరిగుట్టకు వెళ్తుందని తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 7.30 గంటలకు మెదక్ నుంచి బయలు దేరి ఉదయం 11.30 గంటల వరకు యాదగిరిగుట్ట చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటికీ తిరిగి వైద్యశిబిరానికి తరలించాలి

డీఎంహెచ్‌ఓ చందునాయక్



శిబిరాన్ని తనిఖీ చేస్తున్న చందునాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): కంటి వెలుగు వైద్యశిబిరానికి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తరలించాలని డీఎంహెచ్‌ఓం చందునాయక్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు వైద్యశిబిరంలో ప్రతి రోజూ 100 నుంచి 150 మందికి వైద్యం చేస్తున్నారన్నారు. కంటి సమస్యలు అందరికీ వైద్యం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దీంతో చికిత్సలకు రాకపోతే ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి గ్రామస్తులకు చికిత్సలకు తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంటివెలుగు మెడికల్ ఆఫీసర్ రమేశ్ బాబు, సూపర్‌వైజర్‌లు రమేశ్, మార్త, పంచాయతీ కార్యదర్శి వెంకట్ తదితరులు, పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిబంధనల ప్రకారమే నిర్వహించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియార్టీ లిస్టులను సరి చేయాలని ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ యాదగిరి, హీరాలాల్, మెదక్ మండల అధ్యక్షుడు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు ప్రశంస



ప్రశంసపత్రం అందజేస్తున్న ప్రతిమాసింగ్

నర్సాపూర్ : మెదక్‌లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో తమ కాలేజీకి ప్రశంసపత్రం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అందజేశారని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. తమ కాలేజీ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రశంసించారన్నారు.

రుచితకు రాజ్ భవన్ నుంచి ఆహ్వానం



తూప్రాన్: రైల్వే ప్రమాదంలో స్కూల్ బస్సు నుంచి ఇద్దరు చిన్నారులను కాపాడి ప్రధాని నరేంద్ర మోదీ నుంచి 'సాహస బాలిక' అవార్డు అందుకున్న శివ్వంపేట రుచితకు రాజ్‌భవన్ నుంచి రిపబ్లిక్ డే సందర్భంగా ఆహ్వానం అందింది. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా సాయంత్రం 7 గంటలకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై నిర్వహించే తేనేటి విందుకు ఎట్ హోం రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందిందని బాలిక తండ్రి బాలగౌడ్ బుధవారం తెలిపారు.

బదిలీలు, పదోన్నతులపై కసరత్తు

- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- జిల్లాలో 3,962 మంది విధుల్లో..
- మొత్తం ఖాళీలు 520
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



విద్యాశాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

మెదక్‌జోన్ : ఎనిమిదేళ్లుగా బదిలీలు, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రక్రియకు సంబంధించి విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేయడంతో జిల్లాలోని టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఇది సజావుగా జరిగితే ప్రధానోపాధ్యాయ పోస్టులు, ఇతర ఖాళీలు భర్తీ కానున్నాయి.

- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 826 ఉన్నాయి. 3,962 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాల్సింది ఉండగా, ప్రస్తుతం 3,442 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా పలు కేటగిరీల్లో 520 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- 2015 తర్వాత ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరగనేలేదు.
- అప్పటి నుంచి వేచి చూస్తున్న ఉపాధ్యాయులను జీఓ 317 ప్రకారం జిల్లాలకు నియమిస్తే మిగతా వారందరికీ బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే వీలు ఉంది.
- రెండేళ్ల సర్వీస్ పూర్తి అవడం, ఒకే చోట ఎనిమిదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఇందుకు సంబంధించి ఈ నెల 27 నుంచి మార్చి 4వ తేదీ వరకు ప్రక్రియ కొసాగనుంది. 28 నుంచి మూడు రోజులపాటు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు.
- బదిలీల జాబితాలో ఉన్న వారంతా వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త స్థానాల్లో చేరుతారు. విభాగాల వారీ బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత పదోన్నతులు కల్పించనున్నారు.
- కొత్త జిల్లాల సీనియార్టీ ప్రకారం ప్రక్రియ కొనసాగించాలని సంబంధిత విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

281 మందికి పదోన్నతులు..

- ఇందులో భాగంగా తొలుత స్కూల్ అసిస్టెంట్లకు మల్టీ జోనల్ ప్రాతిపాదికన పీజీ హెచ్‌ఎంలుగా సెకండ్ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నట్లు తెలిసింది.
- దరఖాస్తు చేసుకున్న వారు పదోన్నతి పొందితే కింది స్థాయివారికి అవకాశం వస్తోంది.
- ఎస్జీటీలు పదోన్నతి పొందితే అన్ని ఖాళీలు ఏర్పడి నిరుద్యోగులకు అవకాశం లభించనుంది.
- జిల్లాలోని ఆయా కేటగిరీలలో 281 మంది ప్రమోషన్ పొందే అవకాశం ఉన్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు చెబుతున్నారు.
- ఇందులో 68 మంది స్కూల్ అసిస్టెంట్లు పీజీ హెచ్‌ఎంలుగా, 213 మంది ఎస్జీటీలు స్కూల్ అసిసెంట్లుగా మారనున్నారు.

> **వివరాలు సేకరిస్తున్నాం**
>
> 
>
> ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి రేపటి నుంచి ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెబుతున్నప్పటికీ అధికారికంగా ఎలాంటి జీఓ రాలేదు. ఇందుకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నాం ఎప్పుడు ఆదేశాలు వచ్చినా వెంటనే పక్రియ ప్రారంభిస్తాం.
>
> – రమేశ్, డీఈఓ, మెదక్

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ

మెదక్‌జోన్ : లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలను టీఎన్జీవో భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగుల హెల్ప్ లైన్ 155326 పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సలహాలు, సూచనలు, న్యాయ సలహాలకు నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం డీఎస్పీ సైదులు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ గురించి, అంధులు సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన గొప్పతనం గురించి వివరించారు. అనంతరం అంధులకు సన్మానం చేశా రు. కార్యక్రమంలో మెదక్ అంధుల ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఆర్డీవో సాయిరాం, అంధుల సంఘాల ప్రతినిధులు ప్రవీన్, సాయిలు, ప్రభాకర్, యాదయ్య పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ముందుకెళ్లాలి



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్) : బాలికలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకెళ్లాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఉన్నత పాఠశాలలో లింగ వివక్ష రహిత సమాజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలికలు, యువతులు, మహిళల కోసం షీ టీంలు ఏర్పాటు చేసిందన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై కస్తూర్బా గిరిజన బాలికల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీఓ నవీన్‌కుమా ర్, సీడీపీఓ హేమభార్గవి, ఎంఈఓ బుచ్చనాయక్, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష, ప్రిన్సిపాల్ మంజుల, వివిధ గ్రామాల మహిళా ప్రజా ప్రతినిధులు, కో ఆప్షన్ మెంబర్ లాయక్, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

- విద్యుత్ దీపాల కాంతుల్లో కలెక్టరేట్
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్



విద్యుత్ దీపాల కాంతుల్లో కలెక్టరేట్



ఫైర్ ఇంజిన్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: గణతంత్ర దినోత్సవ వేడుకలకు మెదక్ కలెక్టరేట్ ముస్తాబైంది. బుధవారం విద్యుత్ దీపాలతో కలెక్టరేట్ భవనాన్ని అందంగా అలంకరించారు. పెద్ద ఎత్తున షామియానాలు వేసి, బారీకేడ్లను ఏర్పాట్లు చేశారు. అలాగే ఫైర్ ఇంజిన్ ద్వారా భవనాన్ని శుభ్రంగా చేశారు. దుమ్ము, ధూళి లేకుండా వాటర్ ట్యాంకర్లతో కడిగారు. దారి పొడుగున రంగురంగుల పతాకాలు ఏర్పాటు చేశారు. వేడుకల సందర్భంగా గురువారం కలెక్టర్ హరీశ్ జెండావిష్కరించనున్నారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన వారిని సన్మానించడంతోపాటు అవార్డులు, ప్రశంస పత్రాలు అందజేస్తారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కాల్వ మట్టి అక్రమ తరలింపు



మట్టిని తరలించడంతో తగ్గిపోయిన గట్టు

చేగుంట(తూప్రాన్): చెరువులను నింపడానికి ఏర్పాటు చేస్తున్న కాళేశ్వరం కాల్వల మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రుక్మాపూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ శివారులో కాల్వల నిర్మాణం కోసం తవ్విన మట్టిని నాలుగు రోజులుగా వందలాది ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇళ్ల వద్ద మట్టిని నింపుకోవడానికి కాల్వ మట్టి కోసం గ్రామస్తులు వెళ్తే పంచాయతీ పాలకవర్గం కేసుల పేరుతో బెదిరిస్తున్నారని వాపోతున్నారు. అక్రమంగా తరలిస్తుంటే ఊరుకున్న పాలకవర్గం స్థానికుల అవసరాలకు మట్టి తెచ్చుకుంటే ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మట్టి తరలింపు ఆపకుంటే మేజర్ ఇరిగేషన్ అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నిరంతరం నిఘా..

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



స్టేషన్ తనిఖీ చేస్తున్న రోహిణీప్రియదర్శిని

పాపన్నపేట (మెదక్): పోలీసులు నిరంతర నిఘా పెంచితే నేరాలు అదుపులో ఉంటాయని ఎస్పీ రోహిణీప్రియదర్శిని అన్నారు. బుధవారం పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతిరోజూ పోలీస్ స్టేషను పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్ లోని వర్టికల్స్ నిర్వహణ, ఆన్‌లైన్ వినియోగించు విధానం, కేసుల వివరాలు నమోదు చేయు విధానం అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ విజయ్ , పాపన్నపేట ఎస్ఐ విజయ్ నారాయణ్ సిబ్బంది పాల్గొన్నారు.

రివార్డు మేళా నిర్వహించాలి

మెదక్ మున్సిపాలిటీ: రివార్డు మేళాలు నిర్వహించి కేసుల విచారణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించాలని డీజీపీ అంజనీ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అన్ని జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులపై నేర సమీక్ష నిర్వహించారు. ఇందులో ఎస్పీ రోహిణీప్రియదర్శిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. మహిళలు, పిల్లలపై నేరాల నివారణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, సమర్థవంతంగా పనిచేసే అధికారులను గుర్తించి రివార్డులు ఇవ్వాలని అన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది వర్టికల్ విభాగాల వారీగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాన్ని అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ బాలస్వామి, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు సైదులు, యాదగిరి, జిల్లా ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, జిల్లాలోని సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

మెదక్‌జోన్: ఉపాధ్యాయుల సెలవులపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్ల లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దనడం ఎంత వరకు సమంజసం అన్నారు. సెలవులు మంజూరు చేస్తే హైదరాబాద్ వచ్చి ధర్నాలు, నిరసనలు చేస్తున్నారని పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన ఉత్తర్వులు ఇవ్వడాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సమస్యల సాధన కోసం నిరసన తెలియజేయడం భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని,ఆ హక్కును ఉన్నతాధికారులు కాలరాయడం విడ్డూరంగా ఉందన్నారు. బదిలీల్లో జీఓ 317 బాధితులకు ఎలాంటి షరతులు లేకుండా అవకాశం కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వాన్ని నిలదిస్తూ, ముఖ్యంగా 317 జీఓ బాధితులకు అండగా ఉంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంపై ఆగ్రహం



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా
- రాత్రి ఎక్కువ.. పగలు తక్కువ ఇస్తున్నారని ఆవేదన

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వడంపై బుధవారం అల్లాదుర్గం రైతులు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ బోర్లకు పగలు 12 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. సబ్‌స్టేషన్‌లపై అధిక లోడ్ పడుతుందని మూడు రోజులుగా పగలు 6 గంటలు, రాత్రి వేళ 9 గంటలు ఇస్తుండటంతో పంటలకు నీళ్లు పెట్టలేక పోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పూట త్రీఫేజ్ ఇస్తే ఎక్కువగా ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. పగలే ఎక్కువ ఇవ్వాలని కోరుతున్నారు.

అధికారుల ఆదేశాల మేరకే : ఇన్‌చార్జ్ ఏఈ నవాజ్

పగలు త్రీఫేజ్ ఇస్తే సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోడ్ అధికం కావడంతో పైఅధికారుల ఆదేశాల మేరకు రాత్రి ఎక్కువ ఇస్తున్నాం. 12 గంటల నుంచి 15 గంటలు సరఫరా పెంచాం. రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ అందిస్తున్నాం.

ఆధార్ అనుసంధానంతో మంచి ఫలితాలు

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- జాతీయ ఓటర్ల దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టడంతో ఓటరు నమోదు, ఆధార్ అనుసంధానంలో మంచి ఫలితాలు సాధించామని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రశ్నించే అధికారముంటుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటు విలువ, ఆవశ్యకతను తెలుసుకొని తప్పక ఓటు వేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో స్వీప్ నోడల్ అధికారికి రాజి రెడ్డికి స్పెషల్ క్యాటగిరీ అవార్డు రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీలు, పరిశ్రమల యజమానులు, అన్ని శాఖల అధికారుల సమష్టి సహకారం ఉందన్నారు.

విజేతలకు బహుమతుల ప్రధానం..

ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరిస్తామని ఈ సందర్భంగా అధికారులతో ప్రతిమాసింగ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపన్యాసం, వ్యాసరచన, నాటక, పాటలు, చిత్రలేఖనం, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసపత్రాలు అందజేశారు. అదే విధంగా ఓటరు నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించిన జిల్లా స్థాయి, బ్లాక్ స్థాయి అధికారులను జ్ఞాపిక, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ సైదులు, ఆర్డీఓ సాయి రామ్, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, డీఈఓ రమేశ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిర, ఈడీఎం సందీప్ , ఎలక్షన్ సెల్ సిబ్బంది నరేశ్, నవీన్, వివిధ పాఠశాల, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయుధం



పట్టణంలో ర్యాలీ తీస్తున్న ప్రతిమాసింగ్, అధికారులు, విద్యార్థులు

మెదక్‌జోన్ : ఓటు ఎంతో విలువైనది, శక్తివంతమైనది, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాందాస్ చౌరస్తా నుంచి ఐబీ అతిథి గృహం వరకు నిర్వహించిన ర్యాలీని ప్రతిమాసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థిని, విద్యార్థులతో పాటు ఉద్యోగ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఓట్ ఫర్ బెటర్ ఇండియా, 'మై ఓట్ మై ఫ్యూచర్ మై ఓట్ మై ఫ్యూచర్' నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీ సాగించారు. ఈ సందర్భంగా ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. మీ ఓటే మీ స్వరం, మీ భవిష్యత్‌కు నాంది అని, ఎటువంటి ప్రలోభాలకు లొంగక ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ఏడాదిలో నాలుగు సార్లు 18 ఏళ్లు నిండిన యువతకు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించడంతోపాటు 17 ఏళ్లు నిండిన యువత కూడా ముందస్తుగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని అన్నారు. ర్యాలీలో స్వీప్ నోడల్ అధికారి రాజి రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ, జయరాజ్, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ రావు, డీఎస్పీ సైదులు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎలక్షన్ సిబ్బంది నరేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో చేర్యాల సీఐకి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

చేర్యాల(సిద్దిపేట): కారు అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకెళ్లడంతో చేర్యాల సీఐ గాయపడ్డాడు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేర్యాల సీఐ మంచినీళ్ల శ్రీనివాస్‌ బుధవారం ఉదయం హన్మకొండ నుంచి చేర్యాలకు వస్తుండగా మండల పరిధి ముస్త్యాల గ్రామశివారులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనఉన్న కల్వర్టును ఢీకొని దిగువకు దూసుకెళ్లింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సీఐ తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి అనంతరం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి అక్కడ చికిత్స చేసి పంపారు.

చెట్టును ఢీకొన్న కారు.. వ్యక్తికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్‌: చెట్టును కారు ఢీ కొంది. ఈ సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రగాయాలైన సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్‌కు చెందిన హరీశ్‌ బుధవారం పటాన్‌చెరు నుంచి ఐనోల్‌ వెళ్తున్నాడు. ఈక్రమంలో మండల పరిధిలోని ఇంద్రేశం హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో రోడ్డు పక్క చెట్టును ఢీకొట్టాడు. దీంతో హరీశ్‌ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

యూత్‌ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడి ఆత్మహత్య

చిన్నశంకరంపేట(మెదక్‌): చిన్నశంకరంపేట మండల యూత్‌ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని టి.మాందాపూర్‌ గ్రామానికి చెందిన సత్యానారాయణ(45) పెద్ద చెరువులో బుధవారం మధ్యాహ్నం పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య మమత, కుమార్తె, కుమారుడు, తల్లి ఉన్నారు. కుటుంబ కలహాలతో విసిగిపోయి మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్‌ తెలిపారు. కాగా సత్యనారాయణ యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడిగా, ఎంపీటీసీగా సేవలందించారు. సత్యనారాయణ మృతికి సర్పంచ్‌ భిక్షపతిగౌడ్‌, ఎంపీటీసీ ప్రసాద్‌ గౌడ్‌ సంతాపం తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

నర్సాపూర్‌: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం నర్సాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని వెల్దుర్తి మార్గంలో మూతపడిన అల్యూమినియం కంపెనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ టీం ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి 13 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.30 లక్షల నగదు, రెండు బైక్‌లు, 13 మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ధరలేక టమాటా

- 25 కేజీల బాక్సు ధర రూ.100
- మద్దతు ధర లేక నష్టాలు
- ఎకరాకు పెట్టుబడి రూ.35 వేలకు పైనే
- 400 ఎకరాల్లో టమాటా సాగు

ఝరాసంగం(జహీరాబాద్‌): కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర లేకపోవటంతో రైతులకు నష్టాలు తప్పటం లేదు. వర్షాధార పంటలే కాకుండా నీటి సౌకర్యం ఉన్న రైతులు టమాటా పంటలను సాగు చేస్తున్నారు. పండించిన పంటకు సరైన మద్దతు ధర ఉంటేనే రైతు కష్టానికి ప్రతిఫలం లభిస్తుంది. కానీ, పంట చేతికి వచ్చే సరికి సరైన ధర లేకపోవటంతో నష్టాలు చూడక తప్పటం లేదు. టమాటాలు తెంపేందుకు, రవాణా ఖర్చులు కూడా రావటం లేదని రైతులు వాపోతున్నారు. పలు చోట్ల పంటను తెంపి పారబోసిన సందర్భాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల మద్దతు ధర కోసం ఎదురు చూస్తూ పంటను తెంపకుండా చేలలోనే ఉంచుతున్నారు.పెట్టిన పెట్టుబడి రాక తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. పంట బాగా దిగుబడి వస్తున్నా ధరలు మాత్రం రావటం లేదని రైతులు వాపోతున్నారు.

- టమాటా సాగు జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 400 ఎకరాల్లో సాగు చేయగా, ఝరాసంగం మండలంలో 52 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.
- రైతులు టమాటాను సాగు చేసేందుకు జిల్లా నుండే కాకుండా హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లా నుంచి నారును తీసుకవచ్చి సాగు చేస్తున్నామని రైతులు వివరించారు. ఎకరాలో సాగు చేసేందుకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.


బొప్పన్‌పల్లిలో పొలంలోనే ఉంచిన టమాటా

25 కేజీల బాక్సు ధర రూ.100

- పంట చేతికి వచ్చే సరికి 25 కేజీల బాక్సు ధర రూ.100 నుంచి రూ.150 పలుకుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ పెట్టుబడి ఖర్చులు రాలేకపోతున్నాయని వాపోతున్నారు.
- పంటను తెంపేందుకు కూలీలు, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు అధికం అయ్యాయని పేర్కొంటున్నారు. అదే విధంగా మార్కెట్‌లో కమిషన్‌లు కూడా తప్పటం లేదని వాపోతున్నారు.
- చేతికి వచ్చిన పంటలను జహీరాబాద్‌తో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ మార్కెట్‌కు తరలిస్తున్నామని రైతులు చెబుతున్నారు. సరిహద్దు రాష్ట్రం కర్ణాటకకు తరలిద్దామంటే అక్కడ కూడా సరైన ధర లేదని పేర్కొంటున్నారు.
- టమాటాలను తెంపి అమ్మేందుకు మార్కెట్‌కు తరలించినా లాభం లేకపోవటంతో పొలం గట్లపై పారబోస్తున్నారు. అంతే కాకుండా ధరలు పెరుగుతాయేమోనని ఆశతో పంట తెంపకుండా చేలలోనే వదిలేస్తున్నారు. దీంతో పంట కొంత మేరకు పాడవుతుంది.


జీర్లపల్లిలో పారబోసిన టమాటాలు

- రైతులు పండించిన పంట మార్కెట్‌లో ఒకే సారి సప్లై రావటంతో పంట డిమాండ్‌ రావటం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌కు తీసుకెళ్లిన పంట అమ్మకపోవటంతో తీసుకెళ్లిన పంట అక్కడే వదిలి, రైతులు ఇంటికి వచ్చిన సందర్భాలు ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమాటా ఎక్కువగా సరఫరా కావటంతో ఇక్కడి పంటకు డిమాండ్‌ పడిపోతుందని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.
- ఏప్రిల్‌, మే, జూన్‌లో టమాటాకు మద్దతు లభించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పెట్టుబడులు వచ్చేలా లేవు



టమాటాకు సరైన ధర లేకపోవటంతో పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించటం లేదు. ప్రస్తుతం టమాటాను మార్కెట్‌కు తరలింగా లాభాలు రావటం లేదు. కర్ణాటకలోని బీదర్‌కు తరలిద్దామంటే అక్కడ కూడా ధరలు లేవు. సరైన ధర ఉంటే మంచి లాభాలు వస్తాయి.

– మహబూబ్‌ జాని, టమాటా రైతు, బోప్పన్‌పల్లి

ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి



టమాటాను సాగు చేసేందుకు ఎకరానికి రూ.35 వేలకు పైగా ఖర్చు వస్తుంది. మూడు నెలల పాటు పంటను అన్ని విధాలుగా కాపాడాల్సి వస్తుంది. తీరా పంట చేతికి వచ్చే సరికి పంటకు ధర లేకపోవటంతో నష్టాలు చూడాల్సి వస్తుంది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రావటం లేదు.

– రాజు, టమాటా రైతు, కుప్పానగర్‌

మద్దతు ధర కోసం ఎదురు చూస్తున్నాం



రెండు ఎకరాల్లో టమాటా పంటను సాగు చేశాను. చేతికి వచ్చిన పంటను తెంపి హైదరాబాద్‌కు మార్కెట్‌కు తరలించాను. అక్కడ బాక్సు ధర రూ.100 పలికింది. కొన్ని రోజులు ఆగితే ధర వస్తుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నా. ధర బాగుంటేనే పెట్టుబడులు పోనూ లాభాలు మిగులుతాయి.

– సత్తార్‌, టమాటా రైతు, బోప్పన్‌పల్లి

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ


కంటి వెలుగు ప్రయోజనం వివరిస్తున్న ఎమ్మెల్సీ ఫారూఖ్‌

సిద్దిపేటజోన్‌: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు ప్రయోజనకరంగా ఉందని, అందుకు తాను పొందిన లబ్ధి గురించి ఎమ్మెల్సీ ఫారూఖ్‌ హుస్సేన్‌ సీఎం కేసీఆర్‌కు వివరించారు. బుధవారం ఆయన ప్రగతి భవన్‌లో సీఎంను కలిశారు. ఇటీవల దుబ్బాక నియోజకవర్గ పరిధి ఆకారం గ్రామంలో తాను కంటి వెలుగులో పరీక్షలు చేయించుకోగా, తన కంటిలో లోపం ఉన్నట్లు వైద్యులు చెప్పారని, వెంటనే వారి సూచన మేరకు సోమవారం ఆపరేషన్‌ చేయించుకునట్లు వివరించారు.

బొటనవేలి గోరుపై అంబేడ్కర్‌ చిత్రం



పెద్దశంకరంపేట(మెదక్‌): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటకు చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు అవుసుల శ్రీనివాసాచారి బొటనవేలి గోరుపై డాక్టర్‌ అంబేడ్కర్‌, జాతీయజెండాను చిత్రీకరించారు. ఆయన చూపిన కళను పలువురు అభినందించారు. గతంలో కూడా శ్రీనివాస్‌చారి పలు సూక్ష్మ కళాఖండాలను తయారు చేసి అబ్బురపరిచారు.

పింఛన్‌ కోసం వస్తే ప్రాణాలే పోయాయి

- గ్యాస్‌ సిలిండర్‌ పేలి ఇద్దరు సజీవ దహనం
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- బాధిత కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే ఆర్థిక సాయం


అంజమ్మ(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): గ్యాస్‌ సిలిండర్‌ పేలి ఇద్దరు జీవ దహనమైన సంఘటన మెదక్‌ జిల్లా చేగుంట మండలం చిన్న శివునూర్‌ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నశివునూర్‌ పిట్టలవాడకు చెందిన పిట్టల అంజమ్మ(56) తన చిన్న కుమారుడు రాకేశ్‌ కుటుంబంతో ఉంటోంది. పెద్దకుమారుడు సికింద్రాబాద్‌లో ఉంటున్నాడు. రాకేశ్‌ తల్లితో కలిసి జీవనోపాధి కోసం యాదాద్రి భువనగిరి జిల్లాకు గత కొన్ని నెలల క్రితం వచ్చారు. కాగా మోటకొండూరు పరిసర ప్రాంతాల్లో పౌల్ట్రీఫామ్‌లో పనులుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ తరుణంలో పది రోజుల క్రితం రాజాపేట మండలంలోని నెమిల మదిర గ్రామం పిట్టల గూడెం గ్రామానికి వచ్చారు. రాకేశ్‌ స్థానిక సోలార్‌ ప్రాజెక్టులో దినసరి కూలీగా రూ.400లకు పనిచేస్తున్నాడు. భార్య పత్తి ఏరివేతకు వెళ్తూండేది. తల్లి అంజమ్మ వృద్ధురాలు ఇంటివద్దే ఉంటూ పిల్లలను చూస్తుండేది. కాగా తల్లి అంజమ్మ తనకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ రద్దు అవుతుందని తన పెద్ద మనుమరాలు మధుమతి (6)తో కలిసి స్వగ్రామానికి వెళ్లింది. స్వగ్రామంలోని ఇంట్లో ఇద్దరూ నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గ్యాస్‌ సిలిండర్‌ పేలింది. దీంతో ఇంటికి నిప్పు అంటుకుంది. గ్రామస్తులు, సర్పంచ్‌ అశోక్‌ వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే అంజమ్మతో పాటు మనవరాలు మధుమతి మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. ముద్దగా మారిన మృతదేహాలను కదిలించే పరిస్థితి లేనందున ఉన్నతాధికారులతో మాట్లాడిన రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలంలోనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.


రోదిస్తున్న చిన్నారి తల్లి లక్ష్మి


మధుమతి (చిన్ననాటి ఫొటో)

సిలిండర్‌ ఎలా పేలింది?

గ్యాస్‌ సిలిండర్‌ ఎలా పేలిందనే విషయమై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్యాస్‌ ఏజెన్సీ నిర్వాహకులకు కూడా సమాచారం ఇచ్చారు. రాజమ్మ ఇంట్లో కరెంట్‌ సౌకర్యం లేదు. రాత్రి నిద్రించే వేళ కొవ్వొత్తి వెలిగించిందని, ఈ సమయంలోనే గ్యాస్‌ లీకయ్యి సిలిండర్‌ పేలిందనే వాదన వినిపిస్తోంది. అంజమ్మకు చుట్ట, బీడీ తాగే అలవాటు ఉన్నందున అర్ధరాత్రి చుట్ట వెలిగించుకునే ప్రయత్నంలో గ్యాస్‌ లీకై ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కూతురు చనిపోయిందని తల్లి లక్ష్మి విలపిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది.

ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబానికి రూ.50 వేలు, ఎమ్మెల్యే రఘునందన్‌రావు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబీకులకు అండగా ఉంటామని ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు బాధిత కటుంబీకులను ఓదార్చి ఆర్థిక సాయం అందించారు.

తీవ్ర జ్వరంతో బాలుడి మృతి


పసిబాలుడు (ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): తీవ్ర జర్వంతో ఓ పసిబాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామపంచాయతీ పరిధి ఫకీర్‌నాయక్‌తండాలో చోటుచేసుకుంది. బుధవారం గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన లకావత్‌ వీరన్న, రజిత దంపతులకు నెల క్రితం మగబిడ్డ జన్మించాడు. ఎనిమిది రోజులు కిందట తీవ్ర జర్వం రావడంతో కరీంనగర్‌ జిల్లాలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరాడు. తీవ్ర జర్వంతోపాటు రక్తకణాలు తగ్గడంతో బుధవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మారుమూల గ్రామాలు, తండాల్లో సరైన వైద్యం అందకనే మృత్యువాత పడుతున్నారని తండావాసులు అంటున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్‌: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణం సాకి చెరువు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(55)ని బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మునిపల్లి(అందోల్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కంకోల్‌ శివారు 65వ నంబర్‌ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌ నుంచి జహీరాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుదేరా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసుకుని వివరాలు సెకరించారు. మృతదేహాన్ని సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు బుధవారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్‌ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు రూ.18,500 జరిమానా విధించారు.

హై ఓల్టేజీతో..

కల్హేర్‌(నారాయణఖేడ్‌): హై ఓల్టేజీ విద్యుత్‌ సరఫరాతో గృహోపకరణలు కాలిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్‌లో మంగళవారం రాత్రి విద్యుత్‌ హైఓల్టేజీలోఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, మొబైల్‌ ఫోన్‌ చార్జర్లు, విద్యుత్‌ బల్బులు కాలిపోయాయి. స్థానిక పోలీ స్టేషన్‌ సమీపంలో ఎల్‌టీ లైన్‌ విద్యుత్‌ తీగలు కలిసిపోయాయి. దీంతో మండల కేంద్రంలో సగం ఇళ్లలో హై ఓల్టేజీ విద్యుత్‌ సరఫరా జరిగింది.

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన..

- లెక్చరర్‌ను సస్పెండ్‌ చేయాలి
- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్‌


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్‌

కొండపాక(గజ్వేల్‌): కాలేజీలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన లెక్చరర్‌ను సస్పెండ్‌ చేయాలని పీడీఎస్‌యూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యనాథ్‌ డిమాండ్‌ చేశారు. మండల కేంద్రమైన కొండపాకలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ ద్వితీయ విద్యార్థినులపట్ల ఆర్ట్స్‌ లెక్చరర్‌ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలపై పీడీఎస్‌యూ బాలికల కన్వీనర్‌ వైష్ణవి, పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం బుధవారం కళాశాలను సందర్శించారు. కళాశాలలో లెక్చరర్‌ వ్యవహరిస్తున్న తీరుపై విద్యార్థులు పీడీఎస్‌యూ బృందానికి వివరిస్తూ కంటతడి పెట్టారు. దీంతో పాటు కొందరు లెక్చరర్లు పాఠాలు బోధించకుండా కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా విద్యానాథ్‌, వైష్ణవి మాట్లాడారు. లెక్చరర్‌ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు ఇబ్బందులు పెడుతున్న విషయం తెలిసిందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థినులు ప్రిన్సిపాల్‌ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కొన్నేళ్లగా లెక్చరర్‌ ఇలా వ్యవహరిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి లెక్చరర్ల వల్లే ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థినులు రావడం కష్టంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, వారిని విధుల నుంచి సస్పెండ్‌ చేయాలని కోరారు.

మార్కెట్‌ను అభివృద్ధి దిశలో నడిపించాలి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి


పాలక మండలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి తదితరులు

ములుగు(గజ్వేల్‌): మార్కెట్‌ను అభివృద్ధి పయనంలో నడిపించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. ములుగు మండలం వంటిమామిడి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మహ్మద్‌ జహంగీర్‌, వైస్‌ చైర్మన్‌ కె.భూపాల్‌రెడ్డితో పాటు సభ్యులతో బుధవారం మార్కెట్‌ యార్డులో జిల్లా మార్కెటింగ్‌ అధికారి రియాజ్‌ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ రైతుపక్షపాతిగా వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు దళారీల నుంచి కాపాడటం కోసమే రైతు మార్కెట్‌లను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు సలీం, ఎంపీపీ లావణ్య, గజ్వేల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మాదాస్‌ శ్రీనివాస్‌, ములుగు, వర్గల్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌లు అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి వైస్‌ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ నరేష్‌గౌడ్‌, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్‌ నర్సింహారెడ్డి, చిన్నతిమ్మాపూర్‌ సర్పంచ్‌ హంసమహేశ్‌ యాదవ్‌, మార్కెట్‌ కమిటీ సభ్యులు రాందాస్‌, కృష్ణమూర్తి, బాలయ్య, బాపురెడ్డి, తిరుపతినాయక్‌, మహాలక్ష్మి, రాములు, కుమార్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నీటిసంపులో పడి కూలీ మృతి

గజ్వేల్‌రూరల్‌: కూలీ పనిచేస్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి మృతి చెందింది. ఈ సంఘటన గజ్వేల్‌ పట్టణంలో చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్‌ మండలం మునిగడపకు చెందిన వడ్డెర(శివరాత్రి) యాదమ్మ (50), భర్త సోమయ్య దంపతులు గజ్వేల్‌ పట్టణంలోని లక్ష్మీ ప్రసన్ననగర్‌లో నివాసముంటూ కూలీ పనులకు వెళ్తున్నారు. బుధవారం పట్టణంలోని పిడిచెడ్‌ రోడ్డు మార్గంలో ఓ ఇంటి పిల్లర్‌ గుంతలు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిపోయింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పండరి తెలిపారు.

ఇద్దరి అదృశ్యం


స్వరూప (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. బుధవారం ఎస్‌ఐ రంజిత్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కిషన్‌తండాకు చెందిన కేతావత్‌ స్వరూప నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


వేణు (ఫైల్‌)

నర్సాపూర్‌రూరల్‌: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. బుధవారం నర్సాపూర్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్‌ మండలం రుస్తుంపేట గ్రామానికి చెందిన కమ్మరి వేణు ఈనెల 24వ తేదీ రాత్రి బహిర్భూమికని ఇంటి నుంచి తిరిగిరాలేదు. దీంతో అతడి భార్య అపర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు నర్సాపూర్‌ పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

తొమ్మిది మందికి గాయాలు

కొండపాక(గజ్వేల్‌): ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులోని హరితా హోటల్‌ సమీపంలో రాజీవ్‌ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌ జిల్లా గన్నేరువనం గ్రామం నుంచి ఆటోలో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది బచ్చన్నపేట గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో దుద్దెడ శివారులో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న కారు ఆటోను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతోమల్లీశ్వరీ(38), లక్ష్మీనారాయణ(42), తరుణ్‌(26)కు తీవ్రంగా, మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొడుకుని కెనాడాకు పంపుదామని..

- ఎయిర్‌పోర్ట్‌లో దించి వస్తుండగా ప్రమాదం
- తండ్రి మృతి, తమ్ముడికి గాయాలు
- విషయం తెలిసి కొడుకు మళ్లీ ఇంటికి


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్‌): ఉన్నత చదువుల కోసం కొడుకుని విదేశాలకు పంపించేందుకు ఎయిర్‌పోర్టులో దించి కారులో వస్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉన్నత చదువులు చదువుకునేందుకు మండల పరిధి దొంతి గ్రామానికి చెందిన పిట్ల నరేశ్‌(52) పెద్ద కొడుకు నిరంజన్‌ కెనడా మంగళవారం రాత్రి బయలుదేరాడు. కుటుంబ సభ్యులు అతడిని శంషాబాద్‌ ఎయిర్‌పోర్ట్‌లో దిగబెట్టేందుకు కారులో వెళ్లారు. కుమారుడిని విమానాశ్రయంలో దించి తిరుగు ప్రయాణమయ్యారు. బాలానగర్‌– నర్సాపూర్‌ హైవే దుండిగల్‌ వద్ద నిలిపిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో కారులో ముందు కుర్చున్న నరేశ్‌ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవింగ్‌ చేస్తున్న తమ్ముడు కుమారుడు వినయ్‌ సీట్‌ బెల్ట్‌ పెట్టుకోవడంతో హెయిర్‌ బ్యాగ్‌ ఓపెన్‌ కావడంతో గాయలతో బయటపడ్డాడు. మృతుడు సీట్‌ బెల్ట్‌ పెట్టుకోకపోవడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందిన విషయం తెలుసుకున్న నిరంజన్‌ ఎయిర్‌పోర్ట్‌ నుంచి గ్రామానికి చేరుకున్నాడు. మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌ పర్సన్‌ సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


బంగ్లా వెంకటాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

గజ్వేల్‌రూరల్‌: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. గజ్వేల్‌ మండలం బంగ్లావెంకటాపూర్‌, కోమటిబండ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు లబ్ధిదారులను, మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన కూరగాయల పందిళ్లు, పల్లె ప్రకృతివనం, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, సీసీ రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించండి



మాట్లాడుతున్న జగన్

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో రామాయంపేట పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని వాపోయారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షుడు నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడా సామగ్రిని అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత అన్ని రంగాలతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు వాకిటి శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండపోతుగల్‌లో మండల బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వహీద్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీపీఎల్ క్రికెట్ టోర్నీని శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్, జెర్సీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదరెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సర్పంచ్ ఈస్తారీ, ఉపసర్పంచ్ మాణిక్యం, జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యుడు షఫీ, ఎంపీటీసీ మల్లమ్మ, నాయకులు మాణిక్యరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ముకుందరెడ్డి, దయాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట, బోనాల్ గ్రామాల్లో వ్యవసాయ అధికారి హరిప్రసాద్ వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలిచే పురుగు, మొగి, ఆర్మీవామ్‌ల ఉధృతిని గుర్తించినట్టు తెలిపారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలు పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు మాధవి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కోతుల బెడదను నివారించాలి

నర్సాపూర్: పట్టణంలో కోతులు, కుక్కల బెడద నుంచి పట్టణ ప్రజలు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కోతులతో చిన్న పిల్లలు బయట తిరగలేకపోతున్నారని వాపోయారు. ఇటీవల 14వ వార్డులో కోతుల దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని వివరించారు. ఈసందర్భంగా కమిషనర్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నర్సాపూర్: నర్సాపూర్‌లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేసినట్టు కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం యాదవ్ చెప్పారు. పట్టణ పరిధిలోని 531 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): హైదరాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ సభ్యులు బుధవారం కూచారం గ్రంథాలయానికి రెండు కంప్యూటర్లను అందజేశారు. నేచర్ ఐకాన్ యూత్ కోరిక మేరకు కంప్యూటర్లను అందజేసినట్లు వారు తెలిపారు. పోటీ పరీక్షలకు చదువుతున్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో గ్రామానికి తమ వంతు సహాయం చేస్తామని పేర్కొన్నారు.

ఓటు వజ్రాయుధం

జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని.. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.



మెదక్‌జోన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మెదక్‌జోన్: మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గణపతి అధ్యక్షతన ఓటర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు విశ్వనాథం, రాజాగౌడ్, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్: నర్సాపూర్‌లో అధికారులు, ఆయా కాలేజీలకు చెందిన విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ ఆంజనేయులు, డీఏఓ జేసీబాయి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయ, ఆర్‌డీఓ కార్యాలయాల సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో బుధవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్దన్, గిర్దావర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): తహసీల్దార్ గంగ ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి వ్యవసాయ మార్కెట్ కమాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిజాంపేట, చల్మెడ గ్రామాల సర్పంచ్‌లు అనూష, నర్సింహారెడ్డి, ఆర్‌ఐ యూసుఫ్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, తహసీల్దార్ చరణ్‌సింగ్, ఎస్‌ఐ బాలరాజు, ప్రిన్సిపాల్ అవనీష్ రెడ్డి, ఆర్‌ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ అబ్దుల్ మన్నాన్, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఆర్‌ఐ రాజు, కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి బాలప్రకాశ్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానమని ఇంచార్జ్ తహసీల్దార్ తారాబాయి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్‌లో..



పెద్దశంకరంపేటలో..



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



వెల్దుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఓటుహక్కు తప్పకుండా పొందాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఎంఈఓ బుచ్చనాయక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): తహసీల్దార్ కమలాద్రి ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్, లెక్చరర్లు మణికాంత్, సురేందర్‌రెడ్డి, దుర్గయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో తహసీల్దార్ హర్దీప్‌సింగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిదీప్‌సింగ్, సర్పంచ్ సుప్రజా భాస్కర్, జెడ్పీటీసీ సరోజ, ఎంపీటీసీ వాణి రమేశ్, ఎస్సై లింగం, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, ఏఓ రాం ప్రసాద్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరప్ప, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేశ్ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సర్పంచ్ నత్తి మల్లేశ్ అన్నారు. బుధవారం కాళ్లకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణంలోని గీతా హైస్కూల్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రావు, ఆర్‌ఐ శ్రీహరి, ప్రిన్సిపాల్ యతిరాజావల్లి, తదితరులు పాల్గొన్నారు.



చేగుంటలో..



టేక్మాల్‌లో..



నర్సాపూర్: ర్యాలీలో అధికారులు విద్యార్థులు

నిధులు సమానంగా కేటాయించండి

నర్సాపూర్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అన్ని వార్డులకు నిధులు సమానంగా కేటాయించాలని కౌన్సిలర్ అశోక్‌గౌడ్ కోరారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీకి చెందిన రెండు కోట్ల 75 లక్షల రూపాయలను పట్టణంలోని ప్రధాన మార్గంలో సీసీ రోడ్డు నిర్మించేందుకు కేటాయించాలని అనుకోవడం సరికాదన్నారు. పట్టణంలోని వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు ఒక్కో వార్డుకు రూ. 50 లక్షలను గతంలో కేటాయించగా నాలుగు వార్డుల్లో ఇంతవరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టకపోవడం సరికాదని కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రాజేందర్, యాదగిరి తదితరులు పేర్కొన్నారు. అలాగే పాత భవనం కూల్చేందుకు ఏడున్నర లక్షల రూపాయలు అవసరం లేదని చెప్పారు. మున్సిపాలిటీకి చెందిన ఆటోలు, ఇతర వాహనాల నిర్వహణ, మరమ్మతుల కొనుగోలులో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. పట్టణంలో కొనసాగుతున్న నిర్మాణ పనులతో పాటు సీసీ రోడ్ల పనులు వేగవంతం చేయాలని కౌన్సిలర్లు కోరగా పనులన్నీ వేగంగా చేపట్టే విధంగా చూడాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి సభ్యులు అమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కౌన్సిలర్లు, కమిషనర్ వెంకట్‌గోపాల్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



తూప్రాన్: మహిళకు కంటి అద్దాలు పెడుతున్న మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్

డీపీఓ సాయిబాబా

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని డీపీఓ సాయిబాబా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, కార్యదర్శి శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు చింతల రవి, గొల్లపల్లి సత్యనారాయణ, వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

తూప్రాన్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 6వ వార్డు ఆయుర్వేద ఆస్పత్రిలో కౌన్సిలర్ జ్యోతి రవీందర్‌గుప్తాతో కలిసి ×కంటి వెలుగు× శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 156 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జ్యోతి, బీఆర్‌ఎస్ పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సత్యలింగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సాయిబాబా

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువుతండాలో బుధవారం ఎంపీపీ రాజునాయక్ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ పద్మ దూద్యనాయక్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సార రామాగౌడ్, నాయకులు కృష్ణనాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రోత్సాహక డబ్బుల పంపిణీ



విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోత్సాహక డబ్బులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని గిరిజన బాలికల మిని గురుకులంలో విద్యార్థినుల తల్లిదండ్రులకు ప్రోత్సహక డబ్బులను బుధవారం ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన విద్యాభివృద్ధి కోసం మిని గురుకులంలో చదువుతున్న విద్యార్థులకు నెలకు రూ. 100 చొప్పున పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తిరుమలేష్, ఉపాధ్యాయులు శోభారాణి, మరోని, మాధవి, సరోజ, లలిత, వైష్ణవి, ప్రమీల, కవిత, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ జావిద్, తదితరులు

రేగోడ్(మెదక్): మండలంలోని కొండాపూర్‌లో సాగు చేసిన పంటలను ఏఓ జావిద్ బుధవారం పరిశీలించారు. అందులో భాగంగా వరి, జొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జొన్న పంటలో ఎక్కువగా ఈ సమయంలో మొవ్వు పురుగు సోకుతుందని, దీని నివారణకు క్లోరంత్రానిలిప్రోల్ మందును ఎకరాకు 80 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఈ దశలో ఎక్కువగా ఆశిస్తుందని, నివారణకు కార్టప్ హైడ్రా క్లోరైడ్ 4జీ గుళికలు వేయాలని సూచించారు. అధికారుల సూ చనలు, సలహాలు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వినిత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం పరీక్షాపై చర్చ కార్యక్రమం జరిగింది. ఆర్ట్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్, మెదక్ అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి, హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు మడూర్‌కు ఎమ్మెల్యే రాక**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మడూర్‌లో గురువారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు తెలిపారు. గ్రామంలో నిర్మించనున్న పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ, పీఏసీఎస్ మీటింగ్‌హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

◆ **కేలండర్ ఆవిష్కరణ**


కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో పద్మశాలి సంఘం నూతన కేలండర్‌ను బుధవారం జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలందరూ ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిస్కె నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టియ్య, నాయకులు జనార్దన్, దుర్గయ్య, పురుషోత్తం, శ్రీనివాస్, ప్రభాకర్, శేఖర్. తదితరులు పాల్గొన్నారు.

◆ **లబ్ధిదారుల ఎంపిక**

రామాయంపేట(మెదక్): మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం ఎంపీపీ కార్యాలయంలో బ్యాంకర్లు లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తూప్రాన్: మున్సిపల్ కార్యాలయంలో మైనార్టీ వెల్ఫేర్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, చైర్మన్ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

◆ **ఉచిత వైద్య పరీక్షలు**



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడిసిటీ ఆస్పత్రి, చేగుంట లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ మంచాల లక్ష్మణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామంలోని పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందించారు. కార్యక్రమంలో చేగుంట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లింగమూర్తి, ఉపసర్పంచ్ ప్రసాద్, మెడిసిటీ అస్పత్రి కోఆర్డినేటర్ సంజయ్, వైద్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

● రేపటి నుంచి
చల్మెడ తిరుమల స్వామి ఉత్సవాలు



పశ్చిమాభిముఖంగా ఉన్న విగ్రహం




స్వామివారి ఆలయం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో సుమారు 700 ఏళ్ల క్రితం స్వయంభువుగా తిరుమల స్వామి అవతరించాడు. ఇక్కడ రథసప్తమిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తారు. ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించే ఉత్సవాల్లో అశేష జనవాహిని పాల్గొననున్నారు. కాకతీయులు కాలంలో దీనిని తిమ్మయ్యశెట్టి నిర్మించినట్టు స్థలపురాణం చెబుతుంది. సాధారణంగా హిందూ దేవాలయాలు తూర్పు ముఖద్వారంతో ఉంటాయి. కానీ ఇక్కడ స్వయంభువు కావడంతో పశ్చిమాభిముఖంగా శిలారూపంలో స్వామివారు దర్శనమిస్తారు. తొలి ఏకాదశి స్వామి జన్మదినం.. రథసప్తమి రోజున కల్యాణం కనువిందుగా నిర్వహిస్తారు. ఇటీవల ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసింది. అంతేకాకుండా ఆలయ సమీపంలో కల్యాణ మండపం నిర్మించింది.

పుష్కరిణీ ప్రత్యేకం..

పశ్చిమాభిముఖంగా ఉన్న స్వామివారికి ఎదురుగా ఉన్న పుష్కరిణి (గుండం) ఎప్పుడూ ఎండిపోదని స్థానికులు పేర్కొంటారు. ఇందులో స్నానమాచరిస్తే సర్వరోగాలు పోతాయని భక్తుల నమ్మకం. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. అదే సమయంలో బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. ప్రభుత్వం తరఫున ఏటా స్వామి వారి కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాం. జాతరలో సీసీ కెమెరాతో ఎల్లప్పుడు పర్యవేక్షిస్తాం.

– ఆకుల మహేశ్, ఆలయ చైర్మన్